భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో పెట్రోల్ బాంబు కలకలం!

భద్రాచలం, మార్చి 5 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం అర్ధరాత్రి కొందరు వ్యక్తులు పెట్రోల్ బాంబుతో దాడి చేసినట్లు కలకలం చెలరేగింది. పెట్రోల్ బాంబు దాడి జరిగినట్లు సోషల్ మీడియాలో వార్త చక్కర్లు కొట్టడంతో స్థానిక జనం బెంబేలెత్తిపోయారు. పూర్తి వివరాల్లోకెళ్తే.. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆసుపత్రిలోకి చొరబడి ఆసుపత్రి సూపరింటెండెంట్ చాంబర్ ఎదుట పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ విషయమై ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ భద్రాచలం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

రంగు కోకిల(ఫైల్)

దమ్మపేట, మార్చి 5 : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ మహిళ మృతిచెందిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. దమ్మపేటకు చెందిన రంగు కోకిల(28) తన పిల్లలను పాఠశాలకు పంపించే హడావుడిలో దుస్తులు ఇస్త్రీ చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలి అపస్మారక స్థితికి వెళ్లింది. చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు సత్తుపల్లి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. దీంతో కుటుంబంలో విషాధఛాయలు అలుముకున్నాయి. మేము సైతం ఫౌండేషన్ సహకారంతో డాక్టర్ అగర్వాల్ ఐ బ్యాంకుకు కోకిల నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. అగర్వాల్ ఐ బ్యాంకు నిర్వాహకులు గ్రామానికి చేరుకుని కోకిల నేత్రాలను సేకరించి ఐ బ్యాంకుకు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బూర్గంపహాడ్, మార్చి 5 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం రాత్రి బూర్గంపహాడ్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో గోదావరి నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

11 మందిపై అట్రాసిటీ కేసు

బూర్గంపహాడ్, మార్చి 5 : మహిళను కులం పేరుతో దూషించి భయభ్రాంతులకు గురిచేసినందుకు 11మందిపై బూర్గంపహాడ్ పోలీసులు బుధవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొప్పుల ధనలక్ష్మి ఇంట్లోకి అదే గ్రామానికి చెందిన నిమ్మల హరీష్ తనతోపాటు 10 మందిని కర్రలతో వెంటబెట్టుకుని వెళ్లి కులం పేరుతో దూషించి ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడేసి భయభ్రాంతులకు గురిచేశాడు. అంతేకాక ధనలక్ష్మి భర్త, కొడుకులను చంపేస్తామని బెదిరించినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లాడ్జిల్లో ఎంట్రీ రిజిస్టర్లు మాయం

భద్రాచలం, మార్చి 5 : భద్రాచలం పట్టణంలోని నాలుగు లాడ్జీల్లో ఎంట్రీ రిజిస్టర్లను గుర్తుతెలియని దుండగులు దొంగతనం చేశారు. గత ఏడాది డిసెంబర్ 25వ తేదీన ఉదయం 3:30, 4:30 సమయంలో ఇదే తరహాలో నాలుగు లాడ్జీల్లో ఎంట్రీ పుస్తకాలు చోరీకి గురయ్యాయి. పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. తాజాగా బుధవారం తెల్లవారుజామున మరోమారు ఎంట్రీ రిజిస్టర్లు నాలుగు లాడ్జీల్లో చోరీకి గురవడంతో యజమానులు కంగుతిన్నారు. అసలు రిజిస్టర్లు ఎవరు దొంగతనం చేస్తున్నారో తెలియక తలలు పట్టుకుంటున్నారు. రిజిస్టర్లలో వచ్చిన కస్టమర్ పూర్తి వివరాలు, ఆధార్ నెంబర్లుతో సహా ఉంటాయి. సైబర్ కేటుగాళ్లు అనేక నేరాలకు పాల్పడే అవకాశం లేకపోలేదు. జరిగిన సంఘటనపై సీసీ పుటేజ్‌ల ఆధారంగా భద్రాచలం సీఐని లాడ్జి యజమానులు కలిసి మరోమారు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తే నిజాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

మరుగుదొడ్ల బేసిన్లు ధ్వంసం

కొత్తగూడెం టౌన్, మార్చి 5: సుజాతనగర్‌లోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్మించిన 13 మరుగుదొడ్లలోని లెట్రిన్ బేసిన్లను దుండగులు పగులగొట్టారు. ఇక్కడ నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్.. మంగళవారం రాత్రి 7.00 గంటలకు పని ముగించుకుని వెళ్లారు. మరుసటి రోజు ఉదయం కూలీలతో కలిసి వచ్చి, పని మొదలుపెట్టేందుకు మరుగుదొడ్ల లోపలికి వెళ్లేసరికి పగిలిన బేసిన్లు కనిపించాయి. ఈ విషయాన్ని ఆ కాంట్రాక్టర్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ తర్వాత, ఎస్సై రమాదేవికి ఫిర్యాదు చేశారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవుల పట్టివేత

టేకులపల్లి, మార్చి 5 : అనుమతులు లేకుండా ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న పశువులను టేకులపల్లి పోలీసులు పట్టుకున్న ఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. టేకులపల్లి ఎస్సై పోగుల సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం టేకులపల్లి పోలీసులు తడికలపుడి క్రాస్‌రోడ్ వద్ద వాహన తనిఖీ చేస్తుండగా రెండు కోడెదూడలు, రెండు ఆవులను ట్రాలీలో తరలిస్తుండగా పట్టుబడ్డారు. బాధ్యులపై కేసు నమోదు చేసి వాటిని పాల్వంచ గోసంరక్షణా కేంద్రానికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మానవత్వం చాటుకున్న యువత

ఇల్లెందు, మార్చి 5 : ఇల్లెందు పట్టణంలో తిరిగే సూడిఆవు కడుపులో దూడ చనిపోవడంతో ఇబ్బంది పడుతుండగా యువకులు ఆ ఆవును ఖమ్మం పశువైద్యశాలకు తరలించి ఆపరేషన్ చేయించి ఆవును కాపాడారు. బుధవారం ఇల్లెందు పట్టణానికి సందీప్, నర్సింహారెడ్డి, రాహుల్, ప్రశాంత్ ట్రాలీమీద ఆవును ఎక్కించుకొని ఖమ్మం రాపర్తినగర్ పశు వైద్యశాలకు తరలించారు. వైద్యులు చనిపోయిన దూడను ఆపరేషన్ చేసి తీసివేసి వైద్యం చేసి పంపించారు. ప్రస్తుతం ఆ ఆవును యువకులు రామ్ దేవ్‌బాబా మందిరంలో ఉంచారు.

కళ్లజోళ్ల పంపిణీ

భద్రాచలం, మార్చి 5 : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, మారుతి నర్సింగ్ కళాశాల, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఏ వాసవీ అసోసియేషన్, యూఎస్ఏ సహకారంతో మారుతి నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో ఉచిత నేత్ర చికిత్సా శిబిరం మంగళవారం నిర్వహించి 5వ బ్యాచ్ 212 మందికి ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎల్ కాంతారావు మాట్లాడుతూ గత నవంబర్ 6 నుంచి నేటివరకు 100 రోజుల్లో 1,920 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 1,200 మందికి కంటి అద్దాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, తిప్పన సిద్ధులు, శ్రీనివాస్, కామేశ్వరరావు, భూపతిరావు, రామలింగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం సందర్శన

మణుగూరు టౌన్, మార్చి 5 : మణుగూరు ఎంపీడీవో కార్యాలయాన్ని జడ్పీ సీఈవో నాగలక్ష్మి బుధవారం సందర్శించారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. మండల పరిషత్ ద్వారా అమలవుతున్న ప్రభుత్వ పథకాలపై సమీక్షించారు. సిబ్బంది అందరూ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో సమష్టిగా కృషి చేయాలని చెప్పారు. అభివృద్ధి అంశాలపై సమీక్ష నిర్వహించి అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

I, **DEEKONDA SRINU NAGESWAR RAO** (old name), S/o VEERABHADRAM, Age:60 years, R/o. H.No. 4-7-108/1, Gajularajam Basthi, Kothagudem Town, Bhadradri Kothagudem District, T.S. - 507101. I Have Changed My Name as **DEEKONDA SREENU NAGESWARA RAO,** (new name) for all purpose.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తంగా ఉండాలి

అశ్వాపురం, మార్చి 5 : సైబర్ నేరాల కట్టడికి ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా సైబర్‌క్రైం ఇన్‌స్పెక్టర్ సముద్రాల జితేందర్ అన్నారు. హెవీ వాటర్ ప్లాంట్ కాలనీ తరంగిణి ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. యువత బాగుంటే దేశం బాగుంటుందని, ప్రతిఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరాల కట్టడిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, సీఐ అశోక్‌రెడ్డి, హెవీవాటర్ ప్లాంట్ డిప్యూటీ జనరల్ మేనేజర్ హెచ్‌కె శర్మ, మండల ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్రపతి భవన్‌లో గిరిజన ఉత్పత్తుల స్టాల్స్

రాష్ట్రపతి భవన్‌లో గిరిజనులు ఏర్పాటు చేసిన స్టాల్స్

భద్రాచలం, మార్చి 5 : గిరిజన మహిళలు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల ద్వారా తయారుచేసే వివిధ రకాల సబ్బులు, షాంపులు, మిల్లెట్ బిస్కెట్లు, కరక్కాయ పౌడర్, తేనె, న్యూట్రిమిక్స్ ఉత్పత్తులను ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు ఐటీడీఏ పీవో రాహుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు అమ్మకాలు జరుగుతాయని, మన రాష్ట్రం నుంచే కాకుండా ఏపీ, తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాల నుంచి ఉత్పత్తులు వచ్చాయన్నారు. భద్రాచలం నుంచి మన ఐటీడీఏ శ్రీలక్ష్మి గణపతి జాయింట్ లయాబిలిటీ గ్రూప్, భద్రాద్రి శ్రీరామ జేఎల్‌జీ గ్రూప్, దమ్మక్క జాయింట్ లయాబిలిటీ గ్రూప్ యూనిట్ మహిళలు రాష్ట్రపతి భవన్‌కు వెళ్లినట్లు తెలిపారు.

'మావోయిస్టులు వద్దు.. అభివృద్ధి ముద్దు..'

ట్రైబల్ యూత్ అసోసియేషన్ పేరిట మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు

మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలిసిన పోస్టర్లు

లక్ష్మీదేవిపల్లి/ అశ్వాపురం, మార్చి 5 : 'మావోయిస్టులు వద్దు.. అభివృద్ధి ముద్దు..' అంటూ మావోయిస్టులకు వ్యతిరేకంగా ట్రైబల్ యూత్ అసోసియేషన్ పేరిట భద్రాద్రి జిల్లాలో పోస్టర్లు వెలిశాయి. లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమల్ల రైతువేదిక గోడలపై, రైతు వేదికకు వెళ్లే దారిని సూచించే గోడపైనా, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌గోడపైనా, రేగళ్ల, అనిశెట్టిపల్లి క్రాస్‌రోడ్, బంగారుచెలకలోని ప్రధాన కూడళ్లలోని గోడలపైనా, అశ్వాపురం మండలం మొండికుంట, అశ్వాపురం, గొందిగూడెం, మిట్టగూడెం ప్రాంతాల్లో అతికించి ఉన్న ఈ పోస్టర్లను బుధవారం తెల్లవారుజామున స్థానికులు గుర్తించారు. సాధారణంగా మావోయిస్టులు ఇలాంటి పోస్టర్లు అంటిస్తూ ఉంటారని, కానీ ఇవి మాత్రం వారికి వ్యతిరేకంగా ట్రైబల్ యూత్ అసోసియేషన్ పేరిట అంటించి ఉన్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. 'శాంతి యుత జీవనం మన హక్కు', 'అనుమానితుల సమాచారం ఇద్దాం – పోలీసులకు సహకరిద్దాం', 'మావోయిస్టులు వద్దు – అభివృద్ధి ముద్దు' అంటూ ఆ పోస్టర్ల లోని సారాంశాలు ఉండడం గమనార్హం.

మిర్చి రైతులను ఆదుకోవాలి : బీఆర్ఎస్

భద్రాచలం ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భద్రాచలం, మార్చి 5 : మిర్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు బుధవారం భద్రాచలం ఆర్డీవో దామోదరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఆకోజు సునీల్‌కుమార్, కోకన్వీనర్ రేపాక పూర్ణచందర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మిర్చి పంట క్వింటాకు రూ.30 వేలు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జయప్రేమ్‌కుమార్, రామకృష్ణ, తమాషాయ్య, సీతామహాలక్ష్మి, భానుప్రసాద్, డానియేల్, ప్రదీప్, నాగేశ్వరరావు, శివ, ప్రియాంక, రాణి పాల్గొన్నారు.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం, మార్చి 5 : నష్టాల ఊబిలో కూరుకుపోతున్న మిర్చి రైతులకు కనీస మద్దతు ధర క్వింటాకు రూ.30 వేలు ప్రకటించాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ కణితి రాముడు, కో–కన్వీనర్ ఎండీ.జానీపాషా డిమాండ్ చేశారు. బుధవారం బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మిర్చి రైతుల సమస్యలపై తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. వెంకట్రావు, పూర్ణయ్య, వీర్రాజు, కామేశ్వరరావు, వెంకటేశ్వరరావు, పృథ్వీ, చందు, భూపతి, వెంకటేశ్వరరావు, సూర్య పాల్గొన్నారు.

చర్లలో..

చర్ల, మార్చి 5 : తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా మండల బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. భద్రాచలం డివిజన్ నాయకుడు మానె రామక్రిష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తాతారావు, కో కన్వీనర్ పవన్‌కుమార్, నాయకులు అజీజ్, రాజారావు, అనిల్, జయమ్మ, రామచంద్రరావు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు ఘనంగా నిత్యకల్యాణం

భద్రాచలం, మార్చి 5 : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారాముల నిత్యకల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిత్యకల్యాణంలో పాల్గొన్న జంటలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

అడిషనల్ ఎస్పీ పరితోజ్ పంకజ్

చర్ల, మార్చి 5 : ఏజెన్సీ ప్రాంతంలో యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అడిషనల్ ఎస్పీ ఆపరేషన్ పరితోజ్ పంకజ్ అన్నారు. బుధవారం చర్ల పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో పోలీసుల ఆధ్వర్యంలో మండలస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. యువతలో ప్రతిభను వెలికితీసేందుకు పోలీసుశాఖ ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్‌సింగ్, చర్ల సీఐ రాజువర్మ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందించిన కలెక్టర్

విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

పాల్వంచ, మార్చి 5: పాల్వంచలోని ఖేలో ఇండియా అకాడమీ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారుల్లో విక్రాంత్, హర్ష, ఆరుషి, కృష్ణ వర్మ.. ఈ నెల 2న హైదరాబాద్‌లో జరిగిన స్టేట్ మీట్‌లో ప్రతిభ చాటారు. ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకు గుంటూరులో జరగబోయే జాతీయస్థాయి ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని, కోచ్ కల్యాణ్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం కలెక్టరేట్‌లో అభినందించారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 5 (నమస్తే తెలంగాణ): టీఎన్‌జీవోస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను, డైరీని కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అమరనేని రామారావు, కార్యదర్శి సాయి భార్గవ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఏర్పాట్లపై నేడు సమీక్ష

భద్రాచలం, మార్చి 5 : ఏప్రిల్ 6, 7వ తేదీల్లో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహించనున్న శ్రీరామనవమి, పట్టాభిషేకం ఏర్పాట్లకు సంబంధించి ఈ నెల 6వ తేదీ గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం ఉంటుందని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. భక్తులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించేందుకు సమగ్ర సమాచారంతో అధికారులు సమావేశానికి రావాలని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం తనిఖీ

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ

లక్ష్మీదేవిపల్లి, మార్చి 5: ఇంటర్ పరీక్షల మొదటి రోజైన బుధవారం.. స్థానిక నలంద జూనియర్ కాలేజీలోని పరీక్షా కేంద్రాన్ని ఎస్పీ రోహిత్ రాజు తనిఖీ చేశారు. అక్కడ విధుల్లో ఉన్న అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. డీఎస్పీ రెహమాన్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్సైలు నరేష్, రమణారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల నిర్మాణానికి స్థలం కేటాయించండి

అశ్వారావుపేట, మార్చి 5 : పాత రెడ్డిగూడెంలో కొండరెడ్ల విద్యార్థులకు ప్రత్యేక పాఠశాల, వసతిగృహాలను నిర్మించటానికి ప్రణాళిక సిద్ధం చేశామని, ఇందుకు 5 ఎకరాల స్థలం కేటాయించాలని తహసీల్దార్ వనం కృష్ణ ప్రసాద్‌ను ఐటీడీఏ ఏఈ ప్రసాద్ కోరారు. బుధవారం తహసీల్దార్‌ను కలిసి అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 152మంది కొండరెడ్ల విద్యార్థులను గుర్తించామని, వీరందరికీ ఒకే ఆశ్రమ పాఠశాల నిర్మించాలని ఐటీడీఏ పీవో ఆదేశించినట్లు వివరించారు. ఇందుకు స్పందించిన తహసీల్దార్ త్వరలోనే స్థలం అప్పగిస్తామని ఏఈకి తెలిపారు.

సంక్షిప్తం..

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

అన్నపురెడ్డిపల్లి, మార్చి 5 : కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఎర్రగుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు మామిళ్లపల్లి పెద్ద లక్ష్మణ్‌రావును బుధవారం మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పరామర్శించారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్‌రావు, నాయకులు మామిళ్లపల్లి రామారావు, మానికల రాంబాబు ఉన్నారు.

మార్కెట్ చైర్మన్‌గా శ్రీను

చర్ల, మార్చి 5 : నూగూరుచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇర్సా శ్రీను నియమితులయ్యారు. వైస్ చైర్మన్‌గా పూనెం రాంబాబు, సభ్యులుగా కారం కన్నయ్య, శ్యామల సీత, ఉయకా వెంకటేశ్వర్లు, కారం జోగారావు, బోదె బోయిన చంద్రయ్యను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.

మహిళలకు ఆటలపోటీలు

టేకులపల్లి, మార్చి 5 : కోయగూడెం ఉపరితల గని మహిళ ఉద్యోగులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించారు. బుధవారం కేవోసీ పరిధి సింగరేణి హైటెక్ కాలనీ సీఈఆర్ క్లబ్‌లో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు మార్చి 8న బహుమతులు అందజేస్తారు. కార్యక్రమంలో లేడీస్ క్లబ్ సెక్రటరీ శ్రీవాణి, సీనియర్ పర్సనల్ అధికారి అజయ్, కమ్యూనికేషన్ కో అర్డినేర్ వేణు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

బూర్గంపహాడ్, మార్చి 5 : మండల కేంద్రమైన బూర్గంపహాడ్‌లో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంఈవో సింహరాజు కలిసి బుధవారం సందర్శించారు. పాఠశాల, కళాశాల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత పాటించాలని సూచించారు. భోజన నాణ్యతను పరిశీలించి వారితో కలిసి భోజనం చేశారు.

ఉత్తమ పాఠశాలగా ముత్తారపుకట్ట

ఇల్లెందురూరల్, మార్చి 5 : ఎఫ్ఎల్ఎన్ బాలమేళ కార్యక్రమంలో కాంప్లెక్స్ పరిధిలో ఉత్తమ పాఠశాలగా ఎంపీపీఎస్ ముత్తారపుకట్ట పాఠశాల నిలిచిందని ఎంఈవో టీవీఆర్ఎన్ స్వామి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని జేబీఎస్ ఇల్లెందు కాంప్లెక్స్ పరిధిలో కార్యక్రమం జరిగింది. ఎంఈవో మాట్లాడారు. పాఠశాల హెచ్ఎం కబ్బాకుల రవి, ఉపాధ్యాయుడు అరెం రవికుమార్‌ను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం లలిత, ఎఫ్ఎల్ఎన్ ఆర్పీలు రాజు, శిరీష, కాంప్లెక్స్ సెక్రటరీ కొడెం కృష్ణయ్య పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

బూర్గంపహాడ్, మార్చి 5 : కార్మికుల వేతనాల పెంపుదల కోసం గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిర్వహించ తలపెట్టిన భారీ ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ పాండవుల రామనాథం పిలుపునిచ్చారు. బుధవారం సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ గేటు వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. నాగేశ్వరరావు, ఎస్‌కె.పాషా, ఎం.వెంకటరెడ్డి, రాము పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

మణుగూరు టౌన్, మార్చి 5 : వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని గుట్టమల్లారం పంచాయతీ పరిధిలో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీని బుధవారం పరిశీలించారు. పిల్లలతో కలిసి భోజనం చేశారు. భోజనం బావుందని, పిల్లలకు క్రమశిక్షణ, విద్య, ఆరోగ్యం, మంచి ఫలితాలు లక్ష్యంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

బీమా చెక్కులు అందజేత

చుంచుపల్లి, మార్చి 5: కొత్తగూడెం కో–ఆపరేటివ్ సొసైటీ నుంచి అప్పు తీసుకున్న నిమ్మలగూడెం గ్రామ రైతు తుంపురి సక్కయ్య, చిమ్నా తండా గ్రామ రైతు భూక్యా హర్జ్యా.. ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబాలకు బీమా కింద రూ.50వేల చొప్పున చెక్కులను సొసైటీ చైర్మన్ మండె వీరహన్మంతరావు బుధవారం హౌసింగ్ బోర్డులోని కార్యాలయంలో అందించారు. ఆడిట్ సీనియర్ ఆఫీసర్ ఆదినారాయణ, సొసైటీ డైరెక్టర్ బండి అమృతరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

పాల్వంచ, మార్చి 5: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకుని, వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మణెమ్మ అన్నారు. కెరీర్ గైడెన్స్‌పై ఏహెచ్ఎస్ రేగళ్ల తండా, ఏజీహెచ్ఎస్ పాల్వంచ, ఏహెచ్ఎస్ పాల్వంచ, ఎస్టీ బీహెచ్ పాల్వంచ పదోతరగతి విద్యార్థులకు పాల్వంచ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాగా చదివాలని, వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని కోరారు.

భద్రతపై అవగాహన ర్యాలీ

పాల్వంచ, మార్చి 5: కేటీపీఎస్ 5,6 దశల్లో ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు 54వ జాతీయ భద్రత వారోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా, సీఈ ప్రభాకర్ ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఏడీఎం వెంకటేశ్వర్లు, ఎస్ఈలు సత్యనారాయణ, కృష్ణ, మోక్షవీర్, డీవైసీసీఏ రామారావు, సేఫ్టీ డీఈ సమ్మయ్య, ఏడీఈలు నాగయ్య, శేషసాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ యత్నానికి నిరసన

రామవరం, మార్చి 5: సింగరేణి కొత్తగూడెం ఏరియా ఆర్‌సీహెచ్‌పీలో వీకే వోసీ ప్రైవేటీకరణ ప్రయత్నాలకు వ్యతిరేకంగా గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నాయకులు గట్టయ్య, మల్లికార్జునరావు, వీరస్వామి, రాములు, జక్కుల గట్టయ్య, మధుకృష్ణ పాల్గొన్నారు.

పాదెం వెంకటేశ్వర్లుకు నివాళి

టేకులపల్లి, మార్చి 5 : ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన ఎర్ర